రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధిఅధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం కేఎల్ గ్రూప్, బందాడా గ్రూప్‌లు ఈ జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ కోర్సులు చేసిన వారు, ఎస్సెస్సీ, ఇంటర్ పాసైన 18 నుంచి 26 సంవత్సరాలలోపు వారు ఈ జాబ్‌మేళాకు అర్హులని ఆయన తెలిపారు.



సన్నాల వైపు మిల్లర్ల చూపు

- జిల్లాలో సన్నరకం ధాన్యానికి పెరిగిన డిమాండ్
- పోటీపడి కొనుగోలు చేస్తున్న మిల్లర్లు
- గ్రామాల వారీగా ఏజెంట్లను నియమించుకొని ధాన్యం కొనుగోళ్లు

నిజామాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సన్నరకం ధాన్యంపై మిల్లర్లు నజర్ పెట్టారు. రైతులతో నేరుగా మాట్లాడుతూ కొనుగోలు చేస్తున్నారు. బీపీటీ, జైశ్రీరాం, ఇతర సన్నరకాలను మద్దతు ధరకు మించి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో ఎక్కువ మొత్తంలో డబ్బులు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది మిల్లర్లు రైతుల నుంచి పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా మరికొంత మంది వ్యాపారులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వమే మొత్తం సన్నరకం ధాన్యం కొనుగోలు చేస్తుండటం, బోనస్ ఇస్తుండటం తో బహిరంగ మార్కెట్‌లో అమ్మేందుకు రైతులు మొగ్గు చూపకపోవడం వల్ల ఎక్కువ మొత్తంలో ధర పెడుతున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న సన్న రకాలు పండించే రైతులను గుర్తిస్తూ కొనుగోళ్లను చేస్తున్నారు. కొంత మంది మిల్లర్లు తమ సమీపం లోని మండలాల రైతులతో మాట్లాడుతూ ధాన్యాన్ని తీసుకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ధరలతో సమానంగా వస్తుండటంతో రైతులు కూడా మొగ్గు చూపుతున్నారు. ధాన్యాన్ని అమ్మకాలు చేస్తున్నారు. సన్నరకం బయట అమ్మే పరిస్థితులు తక్కువగా ఉండటం వానాకాలం ధాన్యానికి ఎక్కువగా డిమాండ్ ఉండటంతో మిల్లర్లు ఈ కొనుగోలు చేస్తున్నారు. బియ్యానికి కూడా డిమాండ్ పెరగడంతో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అవకాశం ఉండటం వల్ల పోటీపడి కొనుగోలు చేస్తున్నారు.

పోటాపోటీగా కొనుగోళ్లు

జిల్లాలో సన్నరకం ధాన్యానికి డిమాండ్ పెరుగు తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో మిల్లర్లు కూడా ముందుకు వస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులతో పాటు పెద్ద రైతులు ఎక్కువ మంది కొనుగోలు కేంద్రాలకు అమ్మేందుకు మొగ్గు చూపు తుండటంతో మిల్లర్లు రంగంలోకి దిగారు. జిల్లాలోని రైస్‌మిల్లర్లతో పాటు ఇతర జిల్లాల మిల్లర్లు వచ్చి సన్నరకం ధాన్యాన్ని పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకముందు మిల్లర్లు కూడా సన్నరకం ధాన్యాన్ని క్వింటాలు రూ.2100 నుంచి 2300 మధ్య కొనుగోలు చేశారు. నెలరోజుల ముందు సన్నరకం ధాన్యానికి క్వింటాలు రూ.2500 వరకు ధర పెట్టారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఆలస్యం కావడంతో జిల్లాలో ధర తగ్గించి మిల్లర్లు కొన్నారు.

భారీగా పెరిగిన వరిసాగు విస్తీర్ణం

జిల్లాలో భారీ ఎత్తున వరిసాగు చేయడం ఎక్కువ మొత్తంలో ధాన్యం దిగుబడి రావడంతో రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల కోసం వేచిచూశారు. వాటిని ప్రారంభించగానే అమ్మకాలను చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మితే మద్దతు ధర క్వింటాలుకు రూ.2320తో పాటు బోనస్‌గా రూ.500 రానుండటంతో రోజుల తరబడి వేచిచూశారు. కొన్ని రోజుల క్రితం వ్యాపారులు కూడా ధర తగ్గించ డం వల్ల ఇబ్బందులు పడ్డ రైతులు రోడ్ల పక్కనే ధాన్యం నిల్వలు ఉంచి కాపలా కాశారు. పది రోజుల క్రితం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి.

జిల్లాలో 670 కొనుగోలు కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 670 వరకు కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేసి సన్నరకాలతో పాటు దొడ్డు రకాలను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడం, రైతులు ఎక్కువగా మొగ్గు చూపడంతో ఎక్కువ మంది వ్యాపారులు సన్నరకం ధాన్యం దొరక దని భావించి మద్దతు ధరకు మించి ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. బిపిటితో పాటు జైశ్రీరాం ధాన్యానికి అత్యధికంగా ధర పెడుతున్నారు. బీపీటీని క్వింటాలుకు రూ.2300 నుంచి 2400 వరకు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. జైశ్రీరాంకు క్వింటాలుకు రూ.2800 నుంచి 2900 వరకు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో సన్నరకం బియ్యా నికి డిమాండ్ పెరగడంతో ఎక్కువ మంది మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వమే మొత్తం కొనుగోలు చేస్తే తమకు ఇబ్బంది వస్తుందని భావించిన మిల్లర్లు గ్రామాల వారీగా ఏజెంట్లను పెట్టుకొని కొనుగోలు చేస్తున్నారు. రైతుల వద్దకే వచ్చి పచ్చి ధాన్యంతో పాటు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తీసు కెళ్తున్నారు. రైతులకు కూడా వెంట వెంటనే డబ్బులను చెల్లిస్తున్నారు. సన్నరకం ధాన్యానికి డిమాండ్ రావడం కొన్ని రకాలకు మద్దతు ధరకు మించి ధర రావడంతో పొలాల వద్దనే అమ్మకాలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యానికి ధర పెరగడం ఇతర రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు కూడా బియ్యం ఎగుమతికి అనుమతి ఉండటంతో మిల్లర్లు, వ్యాపారులు ఎక్కువగా సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లోనే రైతులు ఎక్కువగా సన్నరకాన్ని పండించడం వల్ల డిమాండ్ పెరుగుతుంది. ఇతర రాష్ట్రాలకు కూడా సన్నరకం తక్కువగా వేయడం వానాకాలం పండించిన సన్నాలకే డిమాండ్ ఎక్కువగా ఉండటంతో మిల్లర్లు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా వానాకాలంలో పండిన సన్న రకం బియ్యాన్ని ఎక్కువ మంది కొనుగోలు చేస్తుండటంతో

మిగతా 8వ పేజీలో...

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

నిజామాబాద్ జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

13, 14, 15 తేదీల్లో నిజామాబాద్ జిల్లా, హోటల్ హరిత ఇందూర్, పంచవటి మెగామార్ట్ పైన, రైల్వే స్టేషన్ ఎదురుగా, నిజామాబాద్ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (**సైజును బట్టి చార్జి చేయబడును**). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేళ ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ఇతర అధికారులు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

రెంజల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తూకం వేయాలని, రైతులు తరలించిన ధాన్యం నిల్వలను వాటి నాణ్యతను పరిశీలించి మిషన్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. రైతులు నాణ్యత ప్రామాణాలకు అనుగుణంగా ధాన్యం తీసుకువచ్చేలా అధికారులు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ స్వయంగా ధాన్యం నిల్వలు వాటి నాణ్యతను, తేమ శాతాన్ని పరిశీలించారు. ఈసారి కోతలు త్వరగా పూర్తయినందున రైతులు పచ్చి ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకున్నారని దాని వల్ల కొంత ఆలస్యంగా పంట కోత జరిపిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారని, గత యేడాదితో పోలిస్తే ప్రస్తుతం కొంత తక్కువ పరిమాణంలో ధాన్యం కేంద్రాలకు వస్తుందని నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రవాణా సదుపాయం, గన్నీ బ్యాగులలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్, ఐకేపీ డీపీఎం సాయిలు, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఎం చిన్నయ్య, ఎంపీవో రఫీ ఉన్నారు.

సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

రెంజల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఎన్యూమరేటర్ రోజుకు సగటున కనీసం 15 ఇళ్లను సందర్శిస్తూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. మంగళవారం మండలంలోని అంబేద్కర్ నగర్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణ కోసం నిర్వహిస్తున్న సమగ్ర సర్వే తీరును కలెక్టర్ పరిశీలించారు. సర్వే కోసం హౌస్ విజిటింగ్ సందర్భంగా ఇళ్లకు అతికించిన స్టిక్కర్లపై నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ఎన్యూమరేటర్లు కుటుంబ సభ్యుల వివరాలు ఎటువంటి తప్పిదాలు లేకుండా నమోదు చేయాలని సూచించారు. సర్వేతీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని తహసీల్దార్, ఎంపీడీవోలకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ఐ రవికుమార్, ఎంపీవో రఫీ, పంచాయతీ కార్యదర్శి సునీల్ తదితరులున్నారు.

సర్వేను పక్కగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్

ముప్కాల్: రాష్ట్ర పభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఏలాంటి తప్పులు లేకుండా పక్కగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అంకిత్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మంగళవారం బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్ణీత ఫారంలో అయా కోడ్‌ల వారీగా వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ, ప్రైమరీ స్కూల్ ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపట్టిక పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన వెంట ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీవో గంగామోహన్, పంచాయతీ కార్యదర్శులు రజనీకాంత్, రేణుక, ఎఎస్‌వో ప్రశాంత్, మండల ప్రత్యేక అధికారి స్రవంతి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో గోస్‌మోహిద్దిన్ పాల్గొన్నారు.

చదువులో ర్యాంకులు ముఖ్యం కాదు



మాట్లాడుతున్న కోదండరాం

- పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం పెంచి మానసిక స్థైర్యం కల్పించాలి
- చదువుల పేరుతో విద్యార్థుల్లో ఒత్తిడి పెంచొద్దు
- ఎమ్మెల్సీ కోదండరాం

మోపాల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చదువులో ర్యాంకులు ముఖ్యం కాదని.. అన్ని రంగాల్లో పిల్లలకు శాస్త్రీయ దృక్పథం పెంచి మానసిక స్థైర్యాన్ని కల్పించ డమే విద్య అని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. జన విజ్ఞాన వేదిక, మల్లు స్వరాజ్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మోపాల్ శివారులోని ప్రెసిడెన్సీ పాఠశాలలో నిర్వహించిన బాలోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొన్నేళ్లుగా విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయన్నారు. ప్రతీ ఒక్కరు ర్యాంకులే ప్రాతిపదికన చూస్తున్నారని, కానీ పిల్లలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే విధంగా ప్రయత్నాలు చేయడం లేదన్నారు. చిన్న పిల్లల బాల్యంపై కూడా చదువు పేరిట ఒత్తిడి పెరుగుతుం దన్నారు. ర్యాంకుల పేరు మీద ఒత్తిడి పెరుగుతుండడంతో.. పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ర్యాంకుల పేరు మీద చదివించిన మనం విద్యలో ఇంకా అట్టడుగు స్థాయిలోనే ఉన్నామన్నారు. పిల్లల్లో విద్య పట్ల



విద్యార్థుల సైన్స్ ఫేర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

మిగతా 8వ పేజీలో...



ఇంటర్ విద్యాశాఖ నిర్లక్ష్యం..

క్రీడాకారుల పాలిట శాపం!

- అండర్-19 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు అనుమతులు కరువు
- రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనలేక పోతున్న జిల్లా క్రీడాకారులు
- బాస్కెట్‌బాల్‌కు అనుమతి కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వైనం
- ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు
- జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించలేకపోయిన క్రీడాకారులు
- జిల్లాలో ఫిజికల్ డైరెక్టర్లు కరువు

సుభాష్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ విద్యాశాఖ నిర్లక్ష్యం క్రీడాకారుల పాలిట శాపంగా మారింది. అండర్-19 క్రీడాకారుల కోసం ఇంటర్మీడియెట్ విద్యాశాఖ నుంచి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న అధికారులు అనుమతులు ఇవ్వడంలో అలసత్వం ప్రదర్శించడంతో క్రీడాకారులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ క్రీడావిభాగంలో జిల్లా ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు పంపాలి. ఈ క్రీడా సంవత్సరంలో కొన్నింటికి మాత్రమే అనుమతులు ఇచ్చి ఇంటర్మీడియెట్ విద్యాశాఖ చేతులు దులుపుకుంది. ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవడంతో ఇంటర్మీడియెట్ విద్యాశాఖ క్రీడల వైపు మొగ్గు చూపడం లేదు. జిల్లా మొత్తంగా ఫిజికల్ డైరెక్టర్లు ఒక్కరు కూడా లేకపోవడంతో అనుమతులు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారి స్థానంలో ఎవరినైనా నియమించి రాష్ట్రస్థాయి క్రీడలకు అనుమతులను ఇస్తే రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు తమ ప్రతిభను చాటిచెప్పే అవకాశం ఉంది. ఇప్పటి వరకు కొన్ని క్రీడలకు అనుమతులు ఇచ్చారు. మరికొన్ని క్రీడలకు అనుమతుల కోసం వెళితే నిరాకరించడంతో ఆ క్రీడలు రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం కోల్పోయింది. నవం బరు 8, 9, 10 తేదీలలో మహబూబ్‌నగర్‌లో బాస్కెట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలు జరగగా అనుమతి కోసం బాస్కెట్ బాల్‌కు సంబంధించిన క్రీడాకారులు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులను ఆశ్రయిం చడంతో తమకేమి తెలియదన్నట్లుగా వ్యవహరించడంతో జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి బాస్కెట్‌బాల్ క్రీడాకారులు వెళ్లలేకపోయారు. దీంతో జిల్లా నుంచి అండర్-19 బాస్కెట్‌బాల్ ప్రాతినిధ్యం వహించలేదు. అలాగే తైక్వాండో, వాలీబాల్ క్రీడాకారులు కూడా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరిగారు. వారికి కూడా అనుమతులు లభించలేదని తెలిసింది. రాష్ట్రస్థాయి పోటీలు మరికొన్ని రోజుల్లో జరుగనున్నాయి. వీటికి కూడా అనుమతులు ఇవ్వకపోతే తైక్వాండో, వాలీబాల్ క్రీడాకారులు కూడా నష్టపోవాల్సి వస్తుందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అనుమతులు ఇస్తున్నాం..

: రవికుమార్, ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖ అధికారి



ఫిజికల్ డైరెక్టర్ లేకపోవడంతో అండర్-19 క్రీడలు నిర్వహించడం ఇబ్బందిగా ఉంది. అయినా ప్రతీ క్రీడను క్రీడాకారులు నష్టపోకుండా నిర్వహించేలా కృషి చేస్తున్నాం. జిల్లా స్థాయిలో క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి క్రీడలకు పంపేలా అనుమతులను ఇస్తున్నాం. ఇంకా ఏమైనా క్రీడల ఎంపికలు ఉంటే వాటికి కూడా అనుమతులు ఇచ్చి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతాం.

ఫిజికల్ డైరెక్టర్ లేక ఇబ్బందులు..

అండర్-19 క్రీడా పోటీల్లో ఇంటర్మీడియెట్ కళాశాలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొనాల్సి ఉంటుంది. వీటి కోసం ఇంటర్మీడియెట్ విద్యాశాఖ పాఠశాల స్థాయిలో లాగా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీని నియమిస్తుంది. ప్రస్తుతం జిల్లాలో ఉన్న కళాశాలల్లో ఒక్క పీడీ కూడా లేకపోవడంతో ఎస్‌జీ ఎఫ్ సెక్రెటరీని నియమించలేదు. క్రీడల కోసం ప్రత్యేకంగా ఉండే ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ లేకపోవడంతో క్రీడల నిర్వహణ ఆ శాఖకు భారంగా మారింది. కొన్ని సంవత్సరాలుగా ఒకే ఒక్క పీడీతో ఎస్‌జీఎఫ్ క్రీడలను ముం దుకు సాగించిన ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులు ఆ ఒక్క పీడీ కూడా పదవీ విరమణ పొందడంతో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ పోస్టు ఖాళీగా ఉంది.

మిగతా 8వ పేజీలో...

ఆడబిడ్డలకు వరం కల్యాణ లక్ష్మి

● రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం



వర్నిలో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

వర్ని,నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలకు వరంలాంటి పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు అని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. వర్ని మండల కేంద్రంలో మంగళవారం వర్ని ఉమ్మడి మండలాలకు చెందిన పలువురికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి కృషితో అందిస్తున్న ఈ సహాయంతో ఆడబిడ్డల తల్లిదండ్రులకు భరోసా నింపుతుందని వెల్లడించారు. ప్రతి ఆడబిడ్డకు ఈ పథకం వరంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాటు అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బోధన్‌రూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందని బోధన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని బెల్లాల్ చెరువులో మత్స్యకారుల సంక్షేమం కోసం 1,99,500 రూపాయలు చేప పిల్లల కోసం మంజూరయ్యాయని, చేప పిల్లలను కొనుగోలు చేసి బెల్లాల్ చెరువులో విడుదల చేయడం జరిగిందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చేప పిల్లల రకాలు బొచ్చ, రాహు, బంగారు తీగ చేపలను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడీ ఆంజనేయులు, బోధన్ తహసీల్దార్ విఠల్, కౌన్సిలర్ శరత్ రెడ్డి, దాము, వ్యవసాయ శాఖ ఏఈవో కృష్ణవేణి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కోట అబ్బయ్య, కుల పెద్దలు గంగాధర్, భూయ్య, సుల్తాన్ సాయిలు, నడ్పి లక్ష్మయ్య, దాల్‌మల్క, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్, టిప్పర్ పట్టివేత

బోధన్‌రూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి):అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌తో పాటు ఒక టిప్పర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు బోధన్‌రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. కొప్పర్గ,సాలూర శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోర్తాడ్‌లో ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

మోర్తాడ్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాప్‌లో మంగళ వారం జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ తనిఖీ చేశారు. ఫర్టిలైజర్‌షాప్‌లో ఎరువుల అమ్మకాల వివరాలను అడిగితెలుసుకున్నారు. పురుగు మందులు, ఇతర మందులు రైతులు కొనుగోలు చేసినప్పుడు రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ఎరువులు అధిక ధరలకు అమ్మవద్దని, దుకాణం ఎదుట ఎరువుల వివరాలను, ధరలతో సూచికబోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్, డీలర్‌సునీల్, వంశీ, దిలీప్ పాల్గొన్నారు.

ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌రూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): బోధన్ కోర్టులో మంగళవారం గుట్కా, పాన్ మాసాల తరలించిన వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమాన విధించారని బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 30-10-2024 సాలూర చెక్‌పోస్టు వద్ద గుట్కా, పాన్ మాసాల తరలిస్తున్న వ్యక్తి ఆజామ్ మహ్మద్ యూసుఫ్‌కు మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ముందు నేరం అంగీకరించినందుకు రెండురోజుల జైలుశిక్షతో పాటు 5వేల రూపాయల జరిమాన విధించారన్నారు. గుట్కా,పాన్ మాసాలను ఇతర రాష్ట్రాల నుండి తరలించవద్దని బోధన్‌రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.గుట్కా, పాన్ మాసాల తరలిస్తే జైలుశిక్షతో పాటు కఠిన చర్యలు ఉంటాయన్నారు.

బోధన్ ఉపాధ్యాయులకు ఐకాన్ అవార్డు

బోధన్‌రూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని క్రిసెంట్ హైస్కూల్ సీనియర్ ఉపాధ్యాయులకు టీచర్స్ ఐకాన్ అవార్డు వరించింది. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మైనారిటీ విద్యాసంస్థల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కేఎల్ఎన్ ఆడిటోరియంలో మంగళవారం అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిసెంట్ హైస్కూల్ ఉపాధ్యాయులు అఫ్సన్ జబీన్, నస్రీన్ బేగంలకు టీచర్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి తేమ్రిస్ వైస్ చైర్మన్ మహ్మద్ ఫయిమొద్దీన్, ప్రొఫెసర్ అమీరుల్లా ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రిసెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ జావీద్ మాట్లాడుతూ అత్యుత్తమ సహకారం, యోగ్యత, వినూత్న బోధనను అందించిన తమ పాఠశాల ఉపాధ్యాయినులకు ఐకాన్ అవార్డు లభించడం అభినందనీయమన్నారు.

నూడా విస్తరణ వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి

ఆర్మూర్ టౌన్, నవంబర్12(ఆంధ్రజ్యోతి): నూడా విస్తరణ వల్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ లబ్ధి కొరకు నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని విస్తరించాలని చూస్తుందని, నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలు, అలాగే 541 గ్రామపంచాయతీలు ఉన్నాయని, నూడా పరిధిలో ఇదీవరకే బోధన్, నిజామా బాద్‌రూరల్, ఆర్మూర్ అసెంబ్లీకి సంబంధించిన 73గ్రామాలు నూడా పరిధిలో ఉన్నాయని, ఇంక విస్తరించాలని చూస్తున్నారని, దీని వల్ల ప్రజలకు చాలా ఇబ్బంది కలుగుతుందని, భీమ్‌గల్, బోధన్ నుంచి జిల్లా కేంద్రంలో నూడా కార్యాలయానికి వచ్చి పనులు చేసుకోవాలంటే అవసలు పడాల్సిన వస్తుందని కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే నూడా విస్తరణను అపి బోదన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలకు డెవలప్‌మెంట్ అధారిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శి పొల్కం వేణు, ఉపాధ్య క్షుడు ఆరే రాజేశ్వర్, పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, నవంబర్12(ఆంధ్రజ్యోతి) మున్సిపల్ పరిధిలోని 24, 25 వార్డులలో జరుగు తున్న సమగ్ర సర్వేను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు.తప్పులు లేకుండా సరైన సమాచారాన్ని సేకరించి సర్వేలను పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఆయనవెంట సూపర్ వైజర్ నరేందర్ ఉన్నారు.

చౌట్‌పల్లిలో లక్ష తులసి దళాలార్చన

కమ్మర్‌పల్లి,నవంబరు 12:(ఆంధ్రజ్యోతి) చౌట్‌పల్లిలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనారయణ స్వామి ఆలయంలో మంగళవారం లక్ష తులసిదళాలతో విశేష అర్చన కార్యక్రమాన్ని ఘనంగ నిర్వహించారు. వేదపండితులు రాష్ట్ర అవార్డు గ్రహీత గురుమంచి చంద్రశేఖర శర్మ అధ్వర్యంలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఉత్సవ మూర్తులకు వేదక్తంగా పంచామృతాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

నవీపేట,నవంబరు12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా లగచెర్లలో సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు ఇతర ఉద్యోగులపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, మండల రెవెన్యూ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ దేవిసింగ్, సిబ్బంది ఉన్నారు.

కమ్మర్‌పల్లి: లగచర్లలో ఫార్మ కంపెని ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు అక్కడకు చేరుకున్న తహసీల్దార్ తదతర రెవెన్యూ ఉద్యోగులపై అక్కడి రైతుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ రెవెన్యూ ఉద్యోగులు మంగళవార ఉదయం నల్లబ్యాడ్జీ ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల తహసీల్దార్ అంజనేయులు, ఆర్‌ఐ, టైపిస్టు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బషీరాబాద్‌లో పెద్దమ్మ జాతర



బషీరాబాద్‌లో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

కమ్మర్‌పల్లి, నవంబరు 12: (ఆంధ్రజ్యోతి) మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులో కొలువుదీరిన ముదిరాజ్‌ల ఆర్యాదైవం పెద్దమ్మ అలయ 12వ వార్షికోత్సవాన్ని పురష్కరించుకుని బుధవారం ఆలయంవద్ద జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ముదిరాజ్ సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం అలయం వద్ద సహస్ర కుంకుమార్చన, యజ్ఞ కార్యక్రమాన్ని అలయ పూజారి కృష్ణ పంతులు, శ్రీనివాస్, సతీష్‌ల ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు ముదిరాజ్ సంఘ మ హిళలు, దంపతులు యజ్ఞ కార్యక్రమంలో పా ల్గొన్నారు. బుధవారం జాతర సందర్భంగా ఉదయం నుండి సాయంత్రం వరకు అలయం వద్దప్రత్యేక పూజా కార్యక్రమాలు, బోనాల ఊరేగింపు,పూర్ణాహుతి, పల్లకీసేవతో పాటు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు.భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనిఅ మ్మ వారి ఆశీర్వాదాలు అందకోవాలని కోరారు.కార్యక్రమంలో ముదిరాజ్ సంఘాల సభ్యులు బోడ చిన్న ముత్తన్న, యామగంగాధర్, పిట్ల రా జన్న, మరంపల్లి అశోక్, పట్ల గంగాధర్, గుం డ బోయిన ముత్తన్న పెద్దమ్మ దీక్షపరులు, గ్రామముదిరాజ్ సంఘం,మహిళలు పాల్గొన్నారు.

తులం బంగారం పథకాన్ని వెంటనే ప్రవేశపెట్టాలి

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



భీమ్‌గల్‌లో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్ అంతర్ పాఠశాల క్రీడోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భీమ్‌గల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులతో పాటు లబ్ధిదారులకు తులం బంగారాన్ని వెంటనే అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. మంగళవారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని ఓ పంక్షన్‌హాల్‌లో కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలతలతో కలిసి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దమాట్లాడుతూ పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గలిపిస్తే కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులతో పాటు తులం బంగారాన్ని అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 11నెలలు అవుతున్న తులం బంగారం మాత్రం అందించలేకపోతున్నారు. అలాగే పెన్షన్ రూ.2వేల నుంచి రూ.4వేల వరకు పెంచాలని ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఆడపిల్లలకు పేద కుటుంబాల కోసం ప్రవేశపెట్టిన బృహత్తర పథకం కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ అని, ఈ పథకంఓల రూ.51వేలు అందించి కేసీఆర్ రాష్ట్రంలో ఆడ పిల్లల కుటుంబాలు పడుతున్న బాధలను చూసి రూ.లక్ష 116కు పెంచి వారిలో సంతోషాన్ని నింపాడని తెలిపారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ.2వేల నుంచి రూ.4వేల వరకు పెంచుతానన్న పెన్షన్, రైతులందరికి సంపూర్ణంగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఇదీ నెరవేర్చకుండా పొంతనలేని మాటలతో కాలం వెల్లదీస్తున్నారన్నారు. అనంతరం అంబేద్కర్‌చౌరస్తా వద్ద టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే టీ తాగారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నెప్రేమలత, వైస్‌చైర్మన్ గున్నాల భగత్, భీమ్‌గల్ సొసైటీ చైర్మన్ నర్సయ్య, తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్, కౌన్సిలర్లు నర్సయ్య లింగంనాయక్, సతీష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రైతులకు కిచ్చిన హమీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అములు చేయాలని డిమాండ్ చేస్తు జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజీవ్ రావు చెల్‌గల్ నుండి జగిత్యాల వరకు మంగళవారం చేపట్టిన పాదయాత్ర ప్రాంభ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం వెలుతు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కొద్దసేపు కమ్మర్‌పల్లి సోసైటి కార్యాలయంలో ఆగారు. ఈ సందర్భంగా తన అనుచరవర్గంతో కలిసి కమ్మర్‌పల్లి లోని ఓ హోటల్‌ల్లో బెల్లంటీ తాగారు. ఆయనతో పాటు సహకార సంఘం చైర్మన్ రేగుంట దేవేందర్, నాయకులు బద్ద చిన్నారెడ్డి, గడ్డం స్వామి బద్రి, సుభాష్ గౌడ్. మైలారం సుధాకర్, నేష్ తదితరులు పాల్గొన్నారు.

● తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు క్రీడల్లో ప్రొత్సహించాలి

వేల్పూర్: ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు తల్లిదండ్రులు చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం వేల్పూర్ మండలం మోతె గ్రామ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేల్పూర్ మండల 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను క్రీడా జ్యోతిని వెలిగించి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వివిధ పాఠశాలల క్రీడాకారులు మార్చ్ ఫస్ట్ నిర్వహించగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమస్ఫూర్తి కలిగిన మోతె గ్రామానికి అన్ని విధాలా మంచి జరుగుతుందన్నారు. మలి దశ తెలంగాణ ఉద్యమానికి మోతె గ్రామం ఊపిరుదిందన్నారు. తెలంగాణ రాష్ట్రం రావడంలో మోతె గ్రామం ముఖ్యభూమిక పోషించి ఉద్యమంలో పాలుపంచుకుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కేసీఆర్‌తో పాటు ఉద్యమంను తమ ఊరంత ఉంటామని ఏకగ్రీవంగా తీర్మాణం చేసిన మొదటి గ్రామం మోతెనే అని అన్నారు. అనాడు ఉద్యమనాయకుడు కేసీఆర్ ఉద్యమస్ఫూర్తిని పొందేందుకు మోతె మట్టిని ముడుపుకట్టి తెలంగాణ భవన్‌కు తీసుకువెళ్ళారన్నారు. మళ్ళీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం హోదాలో కేసీఆర్ మోతెకు వచ్చి ముడుపు విప్పరన్నారు. ఆటల్లో గెలుపు, ఓటమిలు సహజమని, విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవా లన్నారు. జీవితంలో ఎదురయ్యే ఆటుపోటులను ఎదుర్కొని నిలబడడానికి, శరీరధారుడ్యానికి, మానసిక ఉల్లాసానికి, క్రీడలు మనకు మనోనిబ్బరాన్ని, ధైర్యాన్ని ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రేణుక, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నాగమణి, సొసైటీ చైర్మన్ మోతె రాజేశ్వర్; హెచ్‌ఎం వైద్యగణేష్, మాజీ ఎంపీటీసీ డొల్ల రాజేశ్వర్, పీఆర్‌టీయు మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవనందం, సీవీ.నర్సింగ్‌రావు, వీడీసీసభ్యులు, హెచ్‌ఎం,టీచర్లు పీఈటీలు పాల్గొన్నారు.

ముగ్గురిపై బదిలీ వేటు

ఆర్మూర్‌టౌన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్‌లోని బీసీ బాలికల వసతిగృహంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురిపై మంగళవారం ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వసతిగృహంలో విద్యార్థుల అవస్థలపై ప్రజావాణిలో ఫిర్యాదు రావడంతో జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారిణి స్రవంతి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికా రులు గంగాధర్, నర్సయ్యలు వసతిగృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులను సమస్య లను అడిగితెలుసుకున్నారు. అనంతరం హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్,కుక్, స్వీపర్‌లను బదిలీ చేసినట్టు హాస్టల్‌వార్డెన్ శ్యామల తెలిపారు.

మద్యానికి బానిసై వృద్ధుడి మృతి

ముప్కాల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రానికి చెందిన గంధపు గంగాధర్(70) వరదకాలువలో దూకి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా మద్యం తాగి బయటకు వెళ్లి తిరిగి వస్తుండేవాడని, అదే విధంగా సోమవారం ఉదయం 11గంటలకు మద్యం తాగి ఇంటి నుంచి బయటకువెళ్లి కిసాన్‌నగర్ ఎస్సారెస్పీ వరదకాలువ బ్రిడ్జి వద్దకు వెళ్లి జీవితంపై విరక్తి చెంది నీటిలో పడి మృతి చెందాడన్నారు. మృతుని కొడుకు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జక్రాన్‌పల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో గల సంతోష్‌నగర్ కాలనీకి చెందిన ఆలకుంట పెద్ద వెంకట్(59) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున టీవీఎస్ ఎక్సెల్‌పై పొలానికి వెళ్ళి వస్తుండగా తొర్లికొండ గ్రామశివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనగా వెంకట్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకట్ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుని కొడుకు వెంకట్‌రాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సభ్యత్వ నమోదులో బీజేపీ ముందజ

ఏర్గట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో బిజేపి ముందజలో ఉందని బాల్కొండ బీజేపీ పార్టీ సభ్యత్వ కోకన్వీనర్ నరేష్ తెలిపారు. మంగళ వారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు ఎలేటి నారాయణ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంంలో పెద్ద ఎత్తున్న సభ్యత్వం చేయించిన కార్యకర్త లకు అభినందలు తెలిపారు. అలాగే మరింత సభ్యత్వ నమోదుకై నవంబర్ 15 లోగా పూర్తి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బద్దం సురేష్ రెడ్డి, ఆనందం గంగేశ్వర్, రంజిత్‌లు పాల్గొన్నారు.

ప్రతీ బూత్‌స్థాయిలో క్రియాశీల సభ్యత్వం పూర్తి చేయాలి

ఆర్మూర్‌టౌన్, నవంబర్12(ఆంధ్రజ్యోతి) ప్రతీ బూత్‌స్థాయిలలో క్రియశీల సభ్యత్వం పూర్తి చేయాని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి అధ్యక్షుడు, మండల పదాధికారులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జీల సమావేశంలో ఆయన పాల్గొని దిశనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భద్రచలం ఇన్‌చార్జీ అమ్దాపూర్ రాజేశ్వర్, మాజీజడ్పీటీసీ సాంధన్న, మండల అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, కార్యదర్శులు రాజేందర్, వినోద్, బూత్ అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

బాన్సువాడలో బోర్‌బావి తవ్వకం ప్రారంభం



బోర్‌బావి తవ్వకాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడటౌన్ , నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 2 వ వార్డులో మంగళవారం మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ బోర్‌బావి తవ్వకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు తమతమ కాలనీల్లో గల బోర్ నీటిని సద్వినియోగం చేసుకోవాలని , నీటిని వృధా కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మోతీలాల్, నార్ల ఉదయ్ , శ్రీకాంత్ , లింగం , తదితరులున్నారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకొని వ్యక్తి మృతి



మృతి చెందిన నడ్పి గంగారాం

జక్రాన్‌పల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెం దిన చిలుకూరి నడ్పి గంగారాం(67) ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మృతి చెం దినట్టు ఎస్సై సీహెచ్. తిరుపతి తెలిపారు. సోమవారం రాత్రి ఇంట్లో మంచంపై పడుకొని బీడీ తాగుతుండగా ప్రమాదవశాత్తు బీడీకి ఉన్న నిప్పురవ్వలు పరుపు మంచంపై పడి మంటు చెలరేగగా మంటల్లో నడ్పి గంగారాం కాలిపోయాడు.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా చికిత్స పొందుతూ నడ్పి గంగారాం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.


ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

రెంజల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయ 4వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో హోమం,ప్రత్యేక పూజలతో పాటు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, ప్రభాకర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో క్రీడా దుస్తుల వితరణ

వేల్పూర్, నవంబర్12(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థులు ఏర్పాటు చేసిన మన బడి మన నిధి ఫౌండేషన్ సభ్యులు మంగళవారం క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు వల్లం రవిపటేల్, కొల్లె భోజన్న, గొర్తె చక్రపాణి, ఆది, మహిపాల్, సూర్‌సేడ బాస్కర్, బోండ్ల సచిన్, గ్రూప్‌సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నింబాచల క్షేత్రంపై గరుడ సేవ



భీమ్‌గల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి):లింబాద్రిగుట్టపై శ్రీలక్ష్మీనర్సింహుని బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగు తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళ వారం గరుడ సేవ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కొండపై శ్రీలక్ష్మీనర్సింహుని ఉత్సవ విగ్రహాలను పల్లకీ లో మంగళ వాయిళ హారతులు, మేళతాళలు, భాజ భజంత్రిలు వెంట రాగా గరుడ వాహ నంపై ప్రతిష్టించారు. రం గురంగుల పూలు, స్వర్ణాభారణాలతో స్వా మిని అలంకరించారు. పల్లకిలో ఆశీసులైన శ్రీలక్ష్మీనర్సింహులను కొండ మాడ వీదులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తజనం గోవింద నామస్మరణాలతో ముందుకు కదిలారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



టీయూ రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి నాయకులు

డిచ్‌పల్లి,నవంబరు 12(ఆంధ్రజ్యోతి):బాసర ట్రిబుల్ ఐటీ పీయూసీ 2వ సంవత్సరం చదువుతున్న స్వాతి ప్రియహాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని, పరామర్శకు వెళ్తే వి ద్యార్థిని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తే ఏబీవీపీ నాయకులను అక్కడి వర్సిటీ అధికారులు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందితో దాడులు చేయించడం బాధాకరమని, ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, మాట్లాడుతూ.. గతంలో కూడా ఓవిద్యార్థి చనిపోతే బాసర విద్యార్థులు వారానికోకరు చనిపోయిన కనీసం పట్టించుకోకుండా విద్యార్థుల ఆత్మహత్యాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏబీవీపీనాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్సిటీలో మౌలిక వసతులు కల్పించాలి



వీసీకి వినతి పత్రం అందజేస్తున్న లంబాడ ఎల్ఎస్‌వో అధ్యక్షుడు జీవన్

డిచ్‌పల్లి,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీయూలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మంగళవారం లంబాడ స్టూడెంట్ ఆర్గానైజేసన్ ఆధ్వర్యంలో వీసీ యాదగిరిరావుకు వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీ వన్ నాయక్ మాట్లాడుతూ..వర్సిటీలో అధ్యాపకుల కొరత వెంటనే భర్తీ చేయాలని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన వినతి ప త్రం అందజేశారు. ఆయన వెంట నాయకులు హనుమాన్‌సింగ్, సంతోష్, పాల్గొన్నారు.

రుద్రూరులో కాకడ హారతి



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కోటగిరి,నవంబరు12(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కార్తీక మాసం ఏకాదశిని పురస్కరించుకుని కాకడ హారతి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున 5గంటలకు భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు, మంగళ హారతులు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గత 15ఏళ్ల నుంచి ఆలయంలో కార్తీక మాసం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి సాయిలు, అర్చకులు నారాయణ శర్మ, రాము శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి: యెండల



ఏబీవీపీ నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే యెండల

బాన్సువాడటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ధర్నా తలపెట్టిన ఏబీవీపీ కార్యకర్తలపై అక్కడ విధులు నిర్వహిస్తున్నటువంటి సీఎస్‌వో రాకేశ్ ప్రైవేటు సిబ్బందితో దాడి చేయించిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే యెండెల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన క్షతగాత్రున్ని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ వరుస ఆత్మహత్యలకు నిలయంగా మారిందన్నారు. సీఎస్‌వో రాకేశ్ ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని, అక్కడ జరుగుతున్న ఆత్మహత్యలపై న్యాయవిచారణ జరిపించాలని, అంతేకాకుండాదాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మగ్గిడి విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్,నవంబరు 12(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండల మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు హరిత, వ్యాయమ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 వాలీబాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బాలబాలికల జట్లు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. ఉత్తమ ప్రతిబ కనబరిచిన మగ్గిడి విద్యార్థులు గుణదీప్, ప్రణీత, హీమప్రియ, విజ్ఞతలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 16నుంచి చేగుంటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో వారు పాల్గొంటారన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ముప్కాల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి):ఖమ్మం జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అం డర్ -17 ఖోఖో పోటీలు నిర్వహించగా బాల్కొండకు చెందిన కేజీబీవీ విద్యార్థిని మైథిలి జాతీయస్థాయికి ఎంపిక కాగా బాల్కొండ మోడల్ స్కూల్ విద్యార్థిని బి.అపర్ణలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా పీడీ ముత్తెన్న, ప్రత్యేక అధికారి భవాని, విద్యార్థులను అభి నందిం చారు. జాతీయస్థాయి నుంచిఅంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



వరి కొయ్యలకు నిప్పు
భూసారానికి ముప్పు

- గ్రామాల్లో వరి కొయ్యలకు నిప్పు పెడుతున్న రైతులు
- నిప్పు పెట్టడంతో భూసారం దెబ్బ తింటుందంటున్న వ్యవసాయ శాఖ అధికారులు
- భూమిలోని మిత్ర పురుగులు అంతరిస్తాయి: శాస్త్రవేత్తలు

నవీపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుపూర్తి కావడంతో యాసంగి పంటల సాగు కోసం రైతులు తమ భూములను సిద్ధం చేస్తున్నారు. గతంలో వరి పంట కోతలను మొదళ్ల వరకు కోడవళ్లతో కోసేవారు. అనంతరం ధాన్యాన్ని సేకరించి వరిగడ్డిని కట్టలు కట్టి పశుగ్రాసానికి వినియోగించేవారు. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో పాటు కూలీల కొరత ఏర్పడడంతో ఆధునిక వ్యవసాయ పద్ధతుల అనుసరణలో భాగంగా హార్వెస్టర్ల ద్వారా వరి కోతలను చేపడుతున్నారు. దీంతో వరికొయ్యలు పెద్దవిగా పొలంలో మిగిలిపోతున్నాయి. దుక్కి దున్నే సమయంలో నాగళ్లకు వరికొయ్యలు అడ్డు వస్తున్నాయని భావిస్తూ పలుచోట్ల రైతులు వరికొయ్యలకు నిప్పంటిస్తున్నారు. దీంతో భూమిలో ఉండే మిత్రపురుగులు అంతరించడంతో పాటు భూసారానికి ముప్పు కలుగుతుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. పైగా వాతావరణ కాలుష్యం ఏర్పడడంతోపాటు పంట పొలాల్లో ఉండే బోర్లకు చెందిన కెబుల్‌వైర్లు, ఫ్యూజ్ డబ్బాలు కాలిపోయే ప్రమాదం ఉంది. అనుకోకుండా వరికొయ్యలకు అంటించిన నిప్పు సమీపంలో ఉన్న ఇళ్లవద్దకు చేరే ప్రమాదం కూడా ఉంటుంది. రోడ్లకు ఇరువైపులా వరికొయ్యలకు నిప్పంటించడంతో పెద్దగా పొగ ఏర్పడడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. దీనిద్వారా అనుకోకుండా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. రైతులు రోటవెటర్ ద్వారా నేలలోనే గడ్డిని కలియ దున్నాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



వరి కొయ్యలకు నిప్పంటించడంతో రోడ్డుపై పొగ ఏర్పడిన దృశ్యం

వరి కొయ్యలకు నిప్పంటిస్తే మిత్ర పురుగులు అంతరించే ప్రమాదం

- నవీన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి, నవీపేట

వరికొయ్యలకు నిప్పంటించి భూమిని దుక్కి దున్నడానికి రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయి. వరికొయ్యలకు నిప్పంటించడంతో భూమిలో ఉన్న మిత్రపురుగులు అంతరించే ప్రమాదం ఉంది. పైగా భూమిలో ఉండే సేంద్రియ కర్బనం సైతం నశిస్తుంది. వాతావరణ కాలుష్యం సైతం ఏర్పడనుంది. రైతులు రోటవెటర్ ద్వారా వరికొయ్యలను భూమిలో కలియ దున్నితే భూసారం పెరిగి పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.



పాల్వంపేటలో బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

లింగంపేటలో రూ.100కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల

- పాల్వంపేటలో బస్తీ ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే

లింగంపేట, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): లింగంపేటలోని మోతె శివారులో రూ.100కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. ఆయన మంగళవారం లింగంగపేట మండలకేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను, భోజనాన్ని అందించేందుకు వారికి మెస్‌చార్జీలను పెంచినట్లు ఆయన తెలియజేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకుని చదువుల్లో ముందుండాలని ఆయన సూచించారు. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో తాను చదువుకుంటున్నప్పుడు అప్పటి ఎంపీ తాడూరి బాలాగౌడ్ మాటలను స్ఫూర్తిగా తీసుకుని బాగా చదువుకుని రాజకీయాల్లోకి వచ్చానని విద్యార్థులకు తెలియజేశారు. కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వరకు త్వరలోనే నాలుగులైన్ల రోడ్డు నిర్మాణపనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. నాగన్న బావిని టూరిజం కేంద్రంగా తయారు చేశామని తెలియజేశారు. అనంతరం పాల్వంపేటలో నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానాను ప్రారంభించారు. రూ.3.37కోట్లతో పెద్దవాగుపై నిర్మించిన వంతెనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత, వైస్ చైర్మన్ రాజు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, తదితరులున్నారు.



లింగంపేటలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్



జర దేఖో!!

బెటాలియన్‌లో రాళ్లు తేలిన రోడ్లు

పోలీస్ బెటాలియన్ రోడ్లు అధ్వానం

- డిచ్‌పల్లిలో కంకర తేలి గుంతల మయంగా రహదారులు
- పట్టించుకోని అధికారులు





గుంతలమయంగా బెటాలియన్ అంతర్గత రోడ్లు

డిచ్‌పల్లి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా క్రమ శిక్షణకు మారుపేరున్న 7వ బెటాలియన్‌లో సమస్యలు రాజ్యమేలుతున్న పరిస్కారానికి అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గత పదేళ్లుగా బెటాలియన్ రోడ్లు కంకర తేలి, గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. సరైన రోడ్డు లేక వాహనాలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్న అధికారులు మాత్రం మరమ్మతులు చేయించడంలో మీనమేశాలు లెక్కిస్తున్నరని బెటాలియన్ పోలీసులు పలువురు 'ఆంధ్రజ్యోతి'తో వాపోయారు. బెటాలియన్ పోలీస్ ఉన్నతాధికారులు కూడా గుంతల రోడ్లపైనే వెళ్తున్నరని, వాటి బాగోగులు పట్టించుకోవడం లేదన్నారు. ద్విచక్రవాహనాలు రాళ్లు తేలిన రోడ్లపై వెళ్త ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో సార్లుమ ద్విచక్ర వాహనాల టైర్లు పంక్చర్‌లు జరిగాయని వాపోతున్నారు. బెటాలియన్ సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించిన సమస్య మాత్రం ఎక్కడవేసిన గొంగడి అక్కడే అనే చందంగా మారిందని, బెటాలియన్ సిబ్బంది వాపోతున్నారు. రాష్ట్రప్రభుత్వంతోపాటు రూరల్ ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి ఎంపీ అర్వింద్, అధ్వానంగా తయారైన రోడ్లను బీటీ రోడ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





ఆంధ్రజ్యోతి ఫోకస్

కార్యాలయం వద్ద చెత్త

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

- ప్రమాదకరంగా పురాతన భవనాలు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది
- చినుకు పడితే అంతా బురదమయం
- ఆవరణలో పేరుకున్న పిచ్చిమొక్కలు
- పశువుల స్వైరవిహారం ఆఫీసుల ముందు

భీమ్‌గల్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. మండల విద్యా వనరుల కేంద్ర భవనం, వ్యవసాయ శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వర్షాకాలం అంతా అధికారులు భయపడుతూ పనిచేశారు. వర్షానికి స్లాబ్ నుంచి నీరు లీకవుతుండడంతో బిక్కుబిక్కుమంటూ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో స్లాబ్‌పై నీరు లీకేజీ కాకుండా పన తాటిపత్రి వేసుకుని అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే నిత్యం వందలాది మంది ప్రజలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న కరెంటు, ఐకేపీ ఈజీఎస్, ఎంఈవో, అగ్రికల్చర్ కార్యాలయాలకు వస్తుంటారు. వర్షం పడితే గ్రౌండ్ మొత్తం బురదమయంగా మారుతున్న పట్టించుకునే నాథుడే లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందులు స్వైర విహారం చేస్తూ మొత్తం పిచ్చిమొక్కలతో డంపింగ్ యార్డుగా మారిపోయింది. అలాగే చుట్టు పక్కల ఉన్న ఇంటి యాజమానులు వాహనాలకు కార్యాలయ ఆవరణలో ఉంచుతున్న అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారాయి. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టాలని, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టి ప్రైవేటు వాహనాలు ఆవరణలో పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన విద్యా వనరుల కేంద్రం భవనం



కార్యాలయ ఆవరణలో సంచరిస్తున్న పందులు ఇలా..

సన్నాలవైపు మిల్లర్ల చూపు

(ఐదో పేజీ తరువాయి)

ధర ఎక్కువగా మిల్లర్లు ధాన్యానికి పెడుతున్నారు. ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తుండటం వల్ల కొన్ని రోజులు గడిస్తే దొరికే పరిస్థితి ఉండకపోవడం వల్ల మిల్లర్లు ఈ ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో మిల్లర్లతో పాటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన పది రోజుల్లో లక్షా 74వేల 878 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటి వరకు కొనుగోలు చేశారు. ప్రతీరోజు భారీ ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు మిల్లర్లకు తరలిస్తున్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు కూడా డిమాండ్ పెరిగింది. మిల్లర్లు ముందుకు రావడంతో ధాన్యంకు ధర పెరిగింది. కొద్దిరోజులు ఆగితే సన్నాలకు మరింత ధర పెరిగే అవకాశం ఉందని మిల్లర్లు తెలిపారు. వానాకాలం ధాన్యానికి ఎక్కువ డిమాండ్ ఉండటం వల్ల కొనుగోలు చేస్తున్నామని వారు తెలిపారు.

ఇంటర్ విద్యాశాఖ నిర్లక్ష్యం.. క్రీడాకారుల పాలిట శాపం

(ఐదో పేజీ తరువాయి)

కళాశాల స్థాయిలో ఎంపికల నిర్వహణ బాధ్యత మొత్తం అండర్-19 ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఉంటుంది. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ లేకపోవడంతో క్రీడా ఎంపికలు ఎప్పుడు ఉంటాయనేది కళాశాల విద్యార్థులకు తెలి యడం లేదు. పాఠశాల స్థాయిలో జాతీయ స్థాయిలో ఆడి కళాశాల స్థాయిలో క్రీడలు జరగకపోవడంతో కళా శాల వరకే క్రీడలను ఆపివేస్తున్నారు. దీంతో క్రీడా కారులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాస్థాయిలో ఎం పికలు లేకపోవడంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లలేకపోతున్నారు. కొందరు ప్రైవేటుగా కోచింగ్‌లు తీసుకొని క్రీడల్లో పాల్గొందామంటే ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లాస్థాయి ఎంపికలకు అనుమతులివ్వాలి..

ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడల ఎంపికలకు విద్యాశాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలని క్రీడాకారులు కోరుతున్నారు. సీనియర్ క్రీడాకారులు, కోచ్‌ల ఆధ్వర్యంలో క్రీడలను నేర్చుకుంటున్న క్రీడాకారులకు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ నుంచి అనుమతులు లేకపోవడంతో రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లలేకపోతున్నారు. అండర్-19 విభాగంలో అన్ని క్రీడలకు జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించేలా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని అసోసియేషన్ సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు. ఇప్పటికే కొన్ని క్రీడా విభాగాలకు అనుమతులు ఇచ్చి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిన మరికొన్ని క్రీడలకు అనుమతులను ఇవ్వకపోవడంతో క్రీడాకారులు నష్టపోయారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రతీ క్రీడకు అనుమతులు ఇవ్వాలని క్రీడా అభిమానులు కోరుతున్నారు.

చదువులో ర్యాంకులు ముఖ్యం కాదు

(ఐదో పేజీ తరువాయి)

సానుకూలత దృక్పథాన్ని పెంచాలన్నారు. విద్య ద్వారా శాస్త్రీయ ఆలోచనలు పెంచే విధంగా చూడాలన్నారు. బాలోత్సవాలు, సెమినార్‌లు విద్యార్థుల్లో వివిధ రుగ్మతులను రూపుమాపడంతో పాటు మంచి నడవడిక, నైపుణ్యాలను లక్షణాలను ఇవి అలవరుస్తాయని కోదండరాం అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలన్నారు. గతంలో పిల్లలను మూల్యాంకనం చేయడానికి అనేక ప్రామాణికాలు ఉండేవన్నారు. విద్యతో పాటు క్రీడల్లో సాంస్కృతిక రంగాలు, ఇతర విషయాలను పరిగణనలోకి తీసుకొని మార్కులు ఇచ్చేవారన్నారు. కానీ ప్రస్తుతం పరీక్షలను, వచ్చే మార్కులనే ప్రామాణికంగా తీసుకుంటున్నారని కోదండరాం అన్నారు. ఇటువంటి బాలోత్సవాలను నిర్వహించడం వల్ల పిల్లల్లోని సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు. చదువు అంటే సమగ్రంగా వికసింపజేయడమేనన్నారు. రెండు కళ్లు ఉండి ప్రపంచాన్ని చూడగలిగేది చదువు మాత్రమేనని అన్నారు. ప్రభుత్వం కూడా విద్యారంగంపై దృష్టి సారించిందని కోదండరాం అన్నారు. విద్యా కమిషన్ ఏర్పాటు అందులో భాగమేన న్నారు. పిల్లలకు క్రీడల పట్ల మమకారం కల్పించేందుకే స్పోర్ట్స్ యూని వర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఉపాధిని ఇచ్చే కోర్సులను అందించేందుకు స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింద న్నారు. మార్కులే ప్రామాణికంగా తీసుకోవద్దని, విద్యార్థులు అన్ని రంగా ల్లో అభివృద్ధి చెందే విధంగా విద్యను అందించాలని ఆయన ఉపా ధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూశర్మ, డాక్టర్ జహనీ నెహ్రూ, రామారావు, రామ్మోహన్‌రావు, రవీంద్రనాథ్ సూరి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని సీఐటీయు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. గత 14 ఏళ్లుగా ఆర్మూర్ బాలికల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎండిఎం కార్మికులను తొలగించడం సరికాదని బియ్యంలో పురుగులు వచ్చాయని దాన్ని సాకుగా చేసి వారిని తొలగించడం సరికాదని సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. కార్మికులపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విచారణ చేయకుండానే తొలగించడం సరికాదన్నారు. సీఐటీయు ఆధ్వర్యంలో ఈనెల 18న ఛలో ఆర్మూర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, కొండ గంగాధర్ పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి గడ్చిరౌలి జిల్లా చీమూరు నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్తగా మంగళవారం ప్రచారం నిర్వహించారు. మాచార్ మండలంలోని కొల్లారా, దేవురి, కర్వడ, మద్నాపూర్, దీర్గావ్, పాలస్కాన్, పీపరాడ గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో బూత్ లెవల్ కార్యకర్తలను కలిసి క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు సైనికులుగా పని చేయాలన్నారు. ఈనెల 15న చీమూర్ నియోజకవర్గంలో జరుగనున్న రాహుల్‌గాంధీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ప్రత్యమ్నాయ మార్గాల ద్వారా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

● గ్రూప్-3 అభ్యర్థులకు కలెక్టర్ సూచన

నిజామాబాద్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మార్గం లో అడవి మామిడిపల్లి వద్ద ఆర్‌యుబి (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణం పనులు జరుగుతున్న దృష్ట్యా ఈనెల 17, 18 తేదీలలో గ్రూప్-3 పరీక్షల కు హాజరయ్యే అభ్యర్థులు ప్రత్యమ్నాయ మార్గాల ద్వారా నిర్ణీత సమ యానికి ముందే తమకు కేటాయించబడిన పరీక్ష కేంద్రాలకు చేరుకో వాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడవి మామిడిపల్లి వద్ద ఆర్‌యుబి పనులు జరు గుతున్నం దున నవంబర్ 10 నుంచి డిసెంబర్ 10వరకు నెలరోజుల పాటు నిజా మాబాద్-ఆర్మూర్ మార్గాల్లో వాహనాల రాకపోకలను దారి మళ్లిం చడం జరిగినందున ఈ విషయాన్ని గమనించి గ్రూప్-3 పరీక్షల కోసం ఆర్మూ ర్ వైపు వెళ్లాల్సిన వారు, ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు వచ్చే అభ్య ర్థులు ప్రత్యమ్నాయ మార్గాల్లో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉన్నం దున నిర్ణీత సమయానికంటేముందుగానే బయలుదేరాలని సూచించారు.

డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలించిన చైర్మన్

ఖిల్లా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రద్దానంద్ గంజ్ మార్కెట్‌లో డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి మున్సిపల్ డిప్యూటీ కమీషనర్‌తో కలిసి పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో రైతుల కోసం కల్పించాల్సిన వసతులపై ఆయన రైతులతో చర్చించారు. లారీ లోడ్‌కు 500 రూపాయలు మాత్రమే చెల్లించాలని రైతులను కోరారు.

ఏం సాధించారని విజయోత్సవాలు

● కాంగ్రెస్ ఏడాది పాలన విజయోత్సవాలపై

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 26 రోజుల పాటు విజయోత్సవాలు చేయడం కాదని అవి రాక్షసోత్సవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను చూసి అసహించుకుంటున్నారని ఆరు నెలలకే కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పోయి ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో బీజేపీని గెలిపించారని అన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన కమీషన్లకు కసరత్తులు చేయడానికే సరిపోయిందని ఉన్నదంతా లూటీ చేయడం పైనే కాంగ్రెస్ నేతలు దృష్టి పెట్టారని అన్నారు. ఏ మొఖం పెట్టుకొని ఉత్సవాలు చేస్తున్నారని ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని, రైతులకు రుణమాఫీ చేయలేదని, ఆసరా పెన్షన్‌లను 4వేలకు పెంచలేదని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం కూడా ఇవ్వలేదని, యువతులకు ఎలక్ట్రికల్ స్కూటీలు ఇస్తామన్న హామీ మరిచారని ఏ మొఖం పెట్టుకొని ఉత్సవాలు చేసుకుంటారని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే పేరుతో ప్రజల వ్యక్తిగత ఆస్తుల వివరాలు ఎందుకు అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. సర్వేకు బీజేపీ వ్యతిరేకం కాదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, ప్రభాకర్, కిశోర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

అట్టహాసంగా ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలు

సుభాష్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్ ఎస్‌జిఎస్ పాఠశాలలో హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 బాలికల విభాగంలో ఈ పోటీలు జరిగాయి. అండర్-17 విభాగంలో మొదటి మ్యాచ్‌లో వరంగల్, ఆదిలాబాద్ జట్లు పోటీ పడగా మొదటి మ్యాచ్ డ్రాగా ముగిసింది. అనంతరం మెదక్ వర్సెస్ హైదరాబాద్‌లు పోటీ పడగా హైదరాబాద్ జట్టు 3-1తో విజయం సాధించింది. అనంతరం నిజామాబాద్, రంగారెడ్డి జట్లు పోటీ పడగా 4-0 తేడాతో నిజామాబాద్ జట్టు ఘనవిజయం సాధించింది. మహబూబ్‌నగర్ నల్గొండ జట్లు పోటీ పడగా 1-0తో మహబూబ్‌నగర్ జట్టు గెలిచింది. ఆదిలాబాద్, కరీంనగర్ జట్లు పోటీ పడగా 0-10 తేడాతో కరీంనగర్ జట్టు ఘనవిజయం సాధించింది. హైదరాబాద్, ఖమ్మం జట్లు పోటీ పడగా 1-2తో ఖమ్మం జట్టు విజయం సాధించింది. రంగారెడ్డి, వరంగల్ జట్లు మధ్య జరిగిన పోటీల్లో రంగారెడ్డి జట్టు 1 గోల్‌తో విజయం సాధించింది. నల్గొండ, మెదక్ జట్లు పోటీ పడగా మెదక్ జట్టు 2 గోల్స్‌తో విజయం సాధించింది. నిజామాబాద్, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన హోరా హోరీ పోరులో నిజామాబాద్ జట్టు 2-0తో విజయం సాధించింది. ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్లు పోటీ పడగా 3-0తో మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించింది. పూల్ మ్యాచ్‌లో అన్ని విజయాలు సాధించి నిజామాబాద్ తర్వాత రౌండ్‌కు చేరుకుంది. ఈ పోటీలను నగర మేయర్ దండు నీతూకిరణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ నాగమణి, స్కూల్ యాజమాన్యం సంతోష్, శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



హాకీ ఆడుతున్న క్రీడాకారులు

విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు తెలపాలి

● ఏబీవీపీ నాయకుల ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిబుల్ ఐటీలో యువతి ఆత్మహత్యకు గల కారణాలు తెలపాలని డిమాండ్ చేస్తూ ఏబివిపి నాయకులు వెళ్లిన సందర్భంలో వారిపై భౌతిక దాడికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఏబివిపి జిల్లా నాయకులు మంగళవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబివిపి నాయకులపై ట్రిబుల్ ఐటి సిబ్బంది అసభ్యకరంగా మాట్లాడుతూ భౌతిక దాడులకు దిగారని ఏబివిపి నాయకుడు సాయికుమార్ దాడిలో తీవ్రంగా గాయపడి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్నాడని అన్నారు. ఈ దాడికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి నాయకులు నవీన్, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో బీజేపీ నాయకుల పరామర్శ

బాసర ట్రిబుల్ ఐటీలో సోమవారం జరిగిన ఘటనలో తీవ్రంగా గాయపడి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏబీవీపీ నాయకులు సాయికుమార్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర నాయకుడు యెండల లక్ష్మీనారాయణ పరామర్శించారు. ఏబివిపి నాయకులపై దాడి చేసిన సీఎస్‌వో రాకేష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రిబుల్ ఐటి విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని ధర్నా చేసిన ఏబివిపి నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. సీఎస్‌వో ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయని విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయవిచారణ జరిపించాలని కమీషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఏబివిపి పూర్వ నాయకులు రెంజర్ల నరేష్, పిల్లి శ్రీకాంత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, స్వామియాదవ్, తదితరులు సాయికుమార్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

లైబ్రరీలో అన్ని రకాల పుస్తకాలు ఉంచాలి

డిచ్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థులకు సరిపడా పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు శీను నాయక్ అన్నారు. ఆదివారం 'ఆంధ్రజోతి' మినీలో సెంట్రల్ లైబ్రరీలో పుస్తకాలు కొరత అనే వార్త రావడంతో స్పందించిన గిరిజన విద్యార్థిశక్తి నాయకులు వర్సిటీ లైబ్రరీ ఇన్‌చార్జి లావణ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అప్‌డెట్ పుస్తకాల వివరాలను తెలుసుకుంటూ పోటీ పరీక్షలకు తగట్టు పుస్తకాలు లైబ్రరీలో ఉంచాలని కోరారు. లైబ్రరీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ సమస్యలు, స్టడీ ప్యాడ్స్ ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల 'పొలం బాట'

డిచ్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో ట్రాన్స్‌కో అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి డీఈ ఉత్తమ్ కుమార్ జాడే, తహసీల్దార్ ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతులు తమ మోటార్‌లకు కెపాసిటర్‌లు అమర్చుకోవాలని, మోటార్‌లు కాలిపోకుండా ఉంటాయని ట్రాన్స్ పార్మార్‌లపై భారం ఉండదని వారు పేర్కొన్నారు. రైతులు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం కృషి చేస్తున్నామని ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, రైతులు స్వయంగా ఎలాంటి మరమ్మతులు చేయవద్దని డీఈ పేర్కొన్నారు. 24గంటల పాటు విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఇళ్లకు సంబంధించి 200 యూనిట్ల లోపు వినియోగదారులు రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకొని జీరో బిల్లు ఇస్తున్నామని తెలిపారు. నూతన వ్యవసాయ కనెక్షన్‌లు త్వరతిగతిన విడుదల చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ శాంతయ్య, ట్రాన్స్ కో ఏఈ గంగారం, తదితరులు పాల్గొన్నారు.

బర్ధిపూర్ చెరువులో చేప పిల్లల విడుదల

డిచ్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్ధిపూర్ కోణం చెరువులో మంగళవారం ఎంపీడీవో రవీందర్, ఏవో సుధమాధురి, చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మత్స్యసంపద పెంచేందుకు ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తుందని వారు తెలిపారు.

బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు

నిజామాబాద్ లీగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా ఆటోను నడిపి 16 సంవత్సరాల బాలుడి మృతికి కారకుడైన షేక్ సర్దార్ అహ్మద్ (డ్రైవర్), మహ్మద్ గౌస్ ఉద్దీన్ (ఆటో ఓనర్) ఇద్దరికి సంవత్సరం కాలం జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వడ్డి హరికుమార్ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... నాగారంకు చెందిన షేక్ సర్దార్ అహ్మద్ (ఆటో డ్రైవర్) షేక్ తౌఫిక్ 16 సంవత్సరాల బాబును ముందర కూర్చోబెట్టుకొని అతివేగంగా అజాగ్రత్తగా ఆటోను నడుపుతూ ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొట్టగా పక్కనే కూర్చున్న బాబు మృతి చెందాడు. డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ఓనర్ అతనికి ఆటోను నడపనందుకు ఇచ్చినందుకు ఆటో ఓనర్ మహ్మద్ గౌస్ ఉద్దీన్‌పై కూడా ఐదవ టౌన్ పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా పోలీసువారి తరఫున పిపి బూసారపు రాజేష్‌గౌడ్ వాదించగా వాదనలు విన్న జడ్జి ఇద్దరికి ఒక సంవత్సరం కాలంపాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థినులు

సిరికొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల ఎంపిక పోటీలలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థినిలు పల్లెశివాని, రితేష, అఖిల, విశాల్య, శ్రీనిధిలు ఎంపికయ్యారని పిడి నగేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నిజామాబాద్ జిల్లాలోని నవ్యభారతి గ్లోబల్ పాఠశాలలో జరుగనున్న ఈ పోటీలలో వీరు పాల్గొంటారని అన్నారు. ఈ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఎంఈవో పి.రాములు, ఉపాధ్యాయ బృందం, విడిసి సభ్యులు విద్యార్థినిలను అభినందించారు.

డిగ్రీ పరీక్ష ఫీజు పొడిగింపు

డిచ్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లిపు తేదీని నవంబరు 12నుంచి నవంబరు 21 వరకు పొడిగించినట్లు సీవోఈ ప్రొ.అరుణ తెలిపారు. నవంబరు 2024న జరిగే దిగువ కోర్సులు బీఏ, బీకాం, బీఎస్సీ, బీటీఏ, బీసీఏ, 1వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అపరాధ రుసుము లేకుండా నవంబరు 20 వరకు ఫీజు చెల్లించుకోవచ్చునని 500రూ. అపరాధ రుసుముతో 21 వరకు చెల్లించవచ్చునని అరుణ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

డిచ్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డి పల్లి గ్రామ వాసి సాయిలు 39 టీఎస్ 16 ఈవీ 5136 ఎక్సెల్ పై వెళ్తుండగా ప్రమాదవశత్తు రచ్చబండ దగ్గర గుద్దుకోవడంతో గత రాత్రి తీవ్ర గాయలు అయ్యాయి. నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గురుకుల పాఠశాల కార్యదర్శి

ప్రైవేటుకు దీటుగా గురుకుల పాఠశాలలు

మోపాల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యాబోధన అందిస్తున్నారని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. మండలంలోని కంజర్ గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలోని ఏడు జోన్‌లలో క్రీడా పోటీలు జరుగుతున్నాయని ఈ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు డిసెంబర్ మొదటి వారంలో రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల కన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నారని అన్నారు. గురుకులంలో చదువుకునే విద్యార్థినిలు చదువుతో పాటు క్రీడా రంగాల్లో కూడా రాణిస్తున్నారని తెలిపారు. జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో అనేక మంది క్రీడాకారులు వివిధ పతకాలను పొందారని తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో మంచి నైపుణ్యాన్ని సాధిస్తున్నారని తెలిపారు. ఈ హాస్టల్‌లో విద్యార్థులకు మంచి భోజనాన్ని కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ లలిత, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్ జిల్లాలకు చెందిన గురుకుల పాఠశాలల క్రీడాకారులు, పీఈటీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ చేతివాటం

ప్రయాణికురాలి బ్యాగు నుంచి బంగారం అపహరణ

వీడియో తీసిన ప్రయాణికుడు, డ్రైవర్‌ను తొలగిస్తూ చర్యలు

సుభాష్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రీజియన్‌కు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ తన చేతివాటాన్ని ప్రదర్శించారు. ప్రయాణికురాలి బ్యాగులో నుంచి బంగారం ఉన్న బాక్సును దొంగిలించి ప్రయాణికులకు దొరికిపోయాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆదివారం నిజామాబాద్ డిపో-1కు చెందిన అద్దె బస్సు డ్రైవర్‌గా ఉన్న రామ్మోహన్‌రెడ్డి దొంగతనానికి పాల్పడుతూ ప్రయాణికులకు చిక్కాడు. వరంగల్ నుంచి నిజామాబాద్ వస్తున్న బస్సులో కరీంనగర్ వద్ద ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ముగ్గురు మహిళా ప్రయాణికులు బ్యానెట్ మీద కూర్చోబెట్టారు. ఓ మహిళా ప్రయాణికురాలు తన బ్యాగును డ్రైవర్ పక్కన పెట్టడంతో డ్రైవర్ తన చేతికి పని చెప్పాడు. ఒక చేత్తో డ్రైవింగ్ చేస్తూ మరో చేత్తో బ్యాగులో ఉన్న సంచిని బయటకు తీసి జేబులో పెట్టుకున్నాడు. దీన్నంతా బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు వీడియో తీశాడు. దీన్ని గమనించని డ్రైవర్ తనకేమి తెలియదన్నట్లు బుకాయించాడు. దీంతో వీడియో తీసిన ప్రయాణికుడు దొంగిలిస్తున్న వీడియోను చూపించడంతో క్షమించమని ప్రయాణికులను వేడుకున్నాడు. దీనిపై ఆర్టీసి ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అద్దెబస్సు డ్రైవర్‌ను ఏ డిపోలో నియమించుకోరాదని ఆదేశాలు జారీ చేశారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దుబ్బా గ్రామంలో అంతర్ పాఠ శాలల 68వ స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడ లను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు.మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలల నుంచి 24టీంలు వచ్చాయని తెలిపారు. ఈ సంద ర్భంగా క్రీడకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లా డుతూ క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. క్రీడకారు లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి బవిష్యత్తు ఉంటుందని చెప్పారు.గ్రామీణ స్థాయి నుంచి మంచి క్రీడల్లో ప్రతిభ కన బర్చి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షిం చారు. క్రీడకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అశోక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చినబాల రాజు, ధర్పల్లి సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున్, జిల్లా అధికార ప్రతినిధి నర్సయ్య, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, వైజిఆర్, చెలిమెల శ్రీనివాస్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, క్రీడకారులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన

డిచ్‌పల్లి, నవంబరు 12 : సమగ్ర కులగణన సర్వే కార్యక్రమాన్ని ఎన్యుమలేటర్‌లు సంబంధిత అధికారులు పకడ్బందీగా నిర్వహించి ఏ రోజుకు ఆ రోజు ఆన్ లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవీందర్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని బర్ధిపూర్‌లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేలో ఉన్న 74 అంశాలలో ప్రతి ఇళ్లు తిరుగుతూ ఎన్యుమలేటర్‌తో పాటు సర్వే అధికారులు వివరాలు అడిగి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలు వెళ్లిన వారి పేర్లు కూడా నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఆర్‌ఐ సంతోశ్, కార్యదర్శి వసంత్ రావులు ఉన్నారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.265	రూ. 285
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.270	రూ. 290





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78100	రూ.72240	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అమరన్ (12.00, 6.45, 10.15)
: క (3.30)
స్క్రీన్-2 : అమరన్ (10.00)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (1.30)
: లక్కీ భాస్కర్ (4.15, 7.30, 10.45)
స్క్రీన్-3 : సింగం అగేన్ (హిందీ) (10.50)
: ధూంధాం (2.00)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (5.00)
: జితేందర్ రెడ్డి (7.45) : క (10.45)
స్క్రీన్-4 : బూల్ బులియా-3 (హిందీ) (10.00, 7.05)
: వంచన (1.25) : బ్లడీ బగ్గర్ (4.05)
: సింగం అగేన్ (హిందీ) (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (10.35)
: లక్కీ భాస్కర్ (1.30, 7.30)
: క (4.30, 10.30)
స్క్రీన్-3 : అమరన్ (10.30, 4.20, 7.30, 10.30)
: జితేందర్‌రెడ్డి (1.40)



దేవి : లక్కీ భాస్కర్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 6.15)
: సింగం అగేన్ (హిందీ) (2.15, 9.15)
విజయ్ : క (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్